క్లుప్తంగా

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా కోటగిరి రాధాకృష్ణ



రాధాకృష్ణకు నియామక పత్రం అందజేస్తున్న సంకినేని వెంకటేశ్వరరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : బీజేపి పట్టణ అధ్యక్షుడిగా సూర్యాపేట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకుడు కోటగిరి రాధాకృష్ణ నియమించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో ఆయనకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరావు నియమాకపత్రాన్ని అందించారు.

బీజేపీలో చేరిక

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురం గ్రామానికి చెందిన పలువురు భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ అభ్యర్థి కడియం రామచంద్రయ్య సమక్షంలో సోమవారం ఆ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మేకల శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, రమేష్, నరేష్ ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు వై.ధీన్‌దయాళ్, ఎం.యాదగిరి, హన్మంతు, దేవేందర్, సత్యనారాయణ, కిరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు వేయించుకోవాలి



అర్వపల్లి: పెంపకందారులు తప్పని సరిగా తమ జీవాలకు ఈ టీకాలను వేయించుకోవాలని పశువైద్యాధికారులు సూచించారు. జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని అడివెంల గ్రామంలో సోమవారం 400 గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నివారణ (పీపీఆర్) టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్, వీఎల్‌ఓ కేఎస్ఎస్. పద్మ, సిబ్బంది యాకయ్య, యాదగిరి, పెంపకందారులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు ఇస్తున్న సర్పంచ్ ఉషారాణి

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన బొడ్డుపల్లి బాలస్వామి ఇటీవల గ్రామంలో ట్రాక్టర్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో వైద్య ఖర్చుల కోసం బీఆర్ఎస్ నాయకులు సోమవారం అతడికి రూ. 25 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ మాట్లాడుతూ పేదలకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంభం ఉషారాణినాగరాజు, పున్న హరిప్రసాద్, కోటమర్తి మల్లయ్య, లొడంగి నాగరాజు, సందీప్, మహేష్, యల్లయ్య, యాకయ్య పాల్గొన్నారు.

పాస్టర్ల సంఘం మండల కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : మండల పరిధిలోని పాతర్లపహాడ్ వైకేబీపీఎం సెంట్రల్ చర్చిలో సోమవారం మండల పాస్టర్ల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ల సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ జి.శాంతయ్య, ఉపాధ్యక్షుడిగా బానోత్ సుధాకర్, జనరల్ సెక్రెటరీగా డాక్టర్ జలగం జేమ్స్, గౌరవ అధ్యక్షుడిగా టి.రవీందర్, జాయింట్ సెక్రెటరీగా పాస్టర్ టి.ప్రవీణ్, ట్రెజరర్‌గా డాక్టర్ పి.మార్కు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా టి.కిరణ్‌బాబు, ఆర్గనైజర్‌గా ఎస్.యాకుబ్, గౌరవ సలహాదారులుగా వి.మత్తయి, బి.మోషేలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ పాస్టర్ పీవీ బోయాజ్, పాస్టర్లు అన్వేష్, ప్రభు కుమార్, పాస్టర్ శ్రీకాంత్, డాక్టర్ నరసింహ చారి, జీవన్, బాలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ సంతాపం



నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీపీ భూక్య పద్మ

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దుబ్బతండా గ్రామానికి చెందిన భూక్య కన్యానాయక్ అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. మృతదేహాన్ని మాజీ ఎంపీపీ భూక్య పద్మ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేతూనాయక్, తూముల ఇంద్రసేనారావు, వినోద్, సుభాన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్ బీ





సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ పాఠశాలలో సాక్షి స్పెల్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు, పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయిలు తదితరులు

- ప్రైవేట్ పాఠశాల విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన
- పోటీ పరీక్షలపై అవగాహన, విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్న వక్త
- రెండు కేటగిరీలుగా పరీక్ష నిర్వహణ

సూర్యాపేటటౌన్ : 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ పాఠశాలలో సోమవారం నిర్వహించిన స్పెల్ బీ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఈ పరీక్షను రెండు కేటగిరీలుగా నిర్వహించారు. కేటగిరీ 3లో 5, 6, 7వ తరగతి విద్యార్థులు, కేటగిరీ 4లో 8, 9, 10వ తరగతి విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ పరీక్షకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. పరీక్ష జిల్లా కేంద్రంతో పాటు కోదాడ బ్రాంచీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జయ పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ మాట్లాడుతూ 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో ఇలాంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పరీక్షలు రాయడం వలన విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన, విషయ పరిజ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ, సాక్షి సిబ్బంది వేములకొండ జానయ్య, అనమాల యాకయ్య, మాదగాని వేణు, పాఠశాల సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు దోహదం



'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో మా పాఠశాలలో నిర్వహించిన స్పెల్ బి పరీక్ష రాశాను. పరీక్ష రాయడం వలన పోటీ పరీక్షలపై అవగాహన కలిగింది. మున్ముందు పోటీ పరీక్షలను రాయడానికి ఎంతగానో దోహదపడుతుంది.

– ఐ.నాగప్రతీక్‌రెడ్డి, 9వ తరగతి

ఆనందంగా ఉంది



'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బి పరీక్ష రాయడం ఎంతో ఆనందంగా ఉంది. మున్ముందు మరిన్ని పరీక్షలు రాసేందుకు అవగాహన ఏర్పడింది. ఇలాంటి పరీక్ష నిర్వహించినందుకు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలుపుతున్నా.

– ఎం.ప్రగతి ఇవాంజలి, 9వ తరగతి

పరీక్ష బాగా రాశాను



'సాక్షి' స్పెల్ బి పరీక్ష బాగా రాశాను. ఈ పరీక్ష వలన ఎంతో అవగాహన ఏర్పడింది. కొత్త పదాలు నేర్చుకోవడానికి ఈ పరీక్ష ఉపయోగపడుతుంది. ఈ పరీక్ష రాయడం ఎంతో ఆనందంగా ఉంది.

– ఎస్.శృతిప్రియ, 8వ తరగతి

చాలా పదాలు తెలుసుకున్నా..



'సాక్షి' స్పెల్ బి పరీక్షలో ఇంగ్లిష్ పదాలు చాలా తెలుసుకున్నా. ఈ పరీక్ష రాయడం వలన ఎంతో అవగాహన ఏర్పడింది. ఇలాంటి పరీక్ష పెట్టినందుకు 'సాక్షి'కి కృతజ్ఞతలు.

– వై.గ్రీష్మ, 6వ తరగతి

పార్టీ మార్పు వార్తలు అవాస్తవం



ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తున్న జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వెంకటనారాయణగౌడ్

- జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్

సూర్యాపేట : బీఆర్ఎస్ పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్ తెలిపారు. అసత్య ప్రచారాలకు పాల్పడుతున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలతో కలిసి సోమవారం సూర్యాపేట ఆర్డీఓ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేక కుట్రలు చేయడం హేయమైన చర్యని అన్నారు. ప్రాణం పోయినా బీఆర్ఎస్‌ను వీడేది లేదన్నారు. అనంతరం తప్పుడు పోస్టులు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా ఎస్పీని కూడా కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన వెంట ఎంపీపీ మర్ల చంద్రారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, పుట్టా కిషోర్, పిల్లి, బైరు వెంకన్నగౌడ్, నాగయ్య గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు కొమ్ముకాస్తున్న అధికారులు



మాట్లాడుతున్న సంకినేని వరుణ్‌రావు

- బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి సంకినేని వరుణ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : బీఆర్ఎస్ పార్టీకి జిల్లా అధికారులు కొమ్ము కాస్తున్నారని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి సంకినేని వరుణ్ ఆరోపించారు. , అసెంబ్లీ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలంటే జిల్లాలో సుదీర్ఘ కాలం నుంచి పనిచేస్తున్న అధికారులను తక్షణమే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లు జిల్లాలో పని చేస్తున్న అధికారులను బదిలీ చేయాలని ఎన్నికల నిబంధన ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు విన్నవించినా స్పందించడం లేదని, దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులను బదిలీ చేయకపోతే జిల్లాలోని బీజేపీ కార్యకర్తలతో కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, కర్నాటి కిషన్, కోటగిరి రాధాకృష్ణ, చల్లమల్ల నర్సింహ, పల్స మల్సూర్, కౌన్సిలర్ కట్కూరి కార్తిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

సూర్యక్షేత్రం సందర్శన



సూర్యక్షేత్రంలో నల్లగొండ ఉద్యోగుల అసోసియేషన్ సభ్యులు

అర్వపల్లి: రాష్ట్రంలోని తొలి సూర్యక్షేత్రమైన తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రాన్ని సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన రైల్వే, విద్యుత్, వివిధ శాఖల ఉద్యోగుల అసోసియేషన్ సభ్యులు సందర్శించారు. క్షేత్రం విశిష్టతను సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి తెలియజేశారు. రాబోయే రోజుల్లో దేశంలోనే ఈ క్షేత్రం ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందనుందని అసోసియేషన్ సభ్యులు చెప్పారు. కార్యక్రమంలో రామ్మూర్తి , బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, ఉద్యోగుల అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇటు శునకాలు.. అటు వానరాలు !





అర్వపల్లి ప్రాథమిక పాఠశాలలో శునకాల స్వైర విహారం, పాఠశాల గదులపై తిరుగుతున్న కోతులు

- అర్వపల్లిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్వైరవిహారం
- దాడి చేసి గాయపరుస్తున్నాయని వాపోతున్న విద్యార్థులు
- సమస్యను పరిష్కరించాలని వినతి

అర్వపల్లి: అర్వపల్లిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిత్యం వందలాది కోతులు, కుక్కలు స్వైర విహారం చేస్తూ విద్యార్థులను బెంబేలెత్తిస్తున్నాయి. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు పాఠశాల ఆరుబయట కూర్చొని భోజనాలు చేస్తుంటారు. ఈ సమయంలో కోతులు, కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయని వాపోతున్నారు. అలాగే పాఠశాల ప్రధాన గేటు, గదులపై రేయింబవళ్లు కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. దీంతో పాఠశాల లోపలికి పిల్లలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. వీటి సమస్యతో పిల్లలు సరిగా చదువుకోలేని పరిస్థితి దాపురించింది. కోతులు, కుక్కల బెడదతో కొందరు విద్యార్థులు సరిగా పాఠశాలకు రాని పరిస్థితి ఏర్పడుతోంది. పాఠశాలకు గేటు ఉన్నప్పటికీ కుక్కలు గోడల పై నుంచి దూకుతూ లోపలికి జొరబడుతున్నాయి. వీటి సమస్యను సంబంధిత అధికారులు పరిష్కరించాలని పిల్లలు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా, కోతులు, కుక్కల బెడదతో ఇబ్బంది పడుతున్నామని, సమస్యను అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లామని ప్రధానోపాధ్యాయురాలు ఎం .యాకలక్ష్మి తెలిపారు.

అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు



ఆత్మకూర్‌లో అమరుల స్థూపాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు ఉధృత చేస్తామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆత్మకూర్, తుమ్మలపెన్‌పహాడ్ గ్రామాల్లో న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నవంబర్ 1 నుంచి 9వరకు జరిగే అమరవీరుల వారోత్సవాల సందర్భంగా అమరవీరుల స్థూపాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరుల త్యాగాలు వృథా కాకుండా ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు కిరణ్, కె.సైదులు, పార్టీ గ్రామ కార్యదర్శి నల్లగొండ నాగయ్య, ఉప సర్పంచ్ కలంచర్ల చంద్రయ్య, పోతురాజు ప్రతాప్, కళంచర్ల శ్రీను, కళంచర్ల ఎల్లయ్య, లింగయ్య, కనకయ్య, నరేష్, దేగల వెంకటకృష్ణ, గునగంటి శ్రీను, గఫార్, యల్లయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ



సూర్యాపేటలో రిపబ్లికన్ పార్టీ తరఫున నామినేషన్ వేస్తున్న వంగపల్లి కిరణ్





సూర్యాపేటలో స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేస్తున్న ఒగ్గు వెంకన్న, మారం వెంకట్‌రెడ్డి



తుంగతుర్తిలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న ఇటికాల చిరంజీవి

- నాలుగో రోజు సూర్యాపేటలో రిపబ్లికన్ సేన పార్టీ తరఫున ఒకరు, ఇద్దరు స్వతంత్రులు నామినేషన్లు దాఖలు
- తుంగతుర్తిలో స్వతంత్ర అభ్యర్థి..

భానుపురి (సూర్యాపేట) : శాసనసభ సాధారణ ఎన్నికల్లో సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. ఆదివారం సెలవు కావడంతో నాలుగో రోజు సోమవారం సూర్యాపేట రిటర్నింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.వీరబ్రహ్మచారికి ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించారు. ఒగ్గు వెంకన్న, మారం వెంకట్‌రెడ్డిలు స్వతంత్ర అభ్యర్థులు కాగా, వంగపల్లి కిరణ్ రిపబ్లికన్ సేన పార్టీ తరఫున నామినేషన్లు వేశారు.

తుగతుర్తిలో..

తిరుమలగిరి (తుంగతుర్తి) : తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి నాలుగో రోజు సోమవారం స్వతంత్ర అభ్యర్థి ఇటికాల చిరంజీవి నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పావలా వడ్డీ పేరుతో మోసం

చివ్వెంల(సూర్యాపేట) : పావలా వడ్డీ పేరుతో ప్రభుత్వం మహిళలను మోసం చేస్తోందని బీఎస్పీ అభ్యర్థి వట్టె జానయ్య యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో మహిళ సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల పోరాటంతో ఏర్పాటు చేసుకున్న తెలంగాణ రాష్ట్రంలో పేదలను గౌరవించడం లేదన్నారు. పావలా వడ్డీ రుణాలు మంత్రి తన ఇంటినుంచి ఇవ్వడం లేదని, పన్ను రూపంలో చెల్లిస్తే వచ్చే ఆదాయంతో ఇస్తున్నారని పేర్కొన్నారు.

వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిక

- కండువాలు కప్పి ఆహ్వానించిన పీసీసీ ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి

అర్వపల్లి: కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి కోరారు. జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ సర్పంచ్ పాలెల్లి సురేష్, ఉపసర్పంచ్ బుడిగె వెంకన్న, మాజీ వైస్ ఎంపీపీ బొడ్డు వెంకన్న, వివిధ పార్టీల నాయకులు గుడిపల్లి మధుసూదన్‌రెడ్డి, జీడి సైదులు, శ్రీకాంత్, మహేష్, విక్రం, రాజేష్, రవి, కుంచం శివశంకర్, ఈర్ల సోనయ్య, సోనబోయిన గంగరాజుతో పాటు మరికొందరు సోమవారం పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, శిగ నసీర్‌గౌడ్, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కె.ప్రవీణ్, రత్నం లక్ష్మాజి, వేములకొండ ఉప్పలయ్య, ఆర్. సంతోష్ పాల్గొన్నారు.

త్వరలో కార్యాచరణ

- వైయస్సార్ తెలంగాణ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిట్ట రాంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాంరెడ్డి

భానుపురి (సూర్యాపేట) : అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కార్యాచరణ విషయంపై నియోజకవర్గ నాయకులతో చర్చించానని, నామినేషన్ ప్రక్రియ, నియోజకవర్గంలో నిర్వహించాల్సిన సమావేశాలపై త్వరలో వెల్లడిస్తామని వైయస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ కోఆర్డినేటర్ పిట్ట రాంరెడ్డి తెలిపారు. సోమవారం సూర్యాపేట నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలు, కార్యకర్తలతో భేటీ అయ్యారు. సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిశీలకులు బీరవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు తండు భాస్కర్ గౌడ్, మైనారిటి సెల్ అధ్యక్షుడు యండి.ఎజాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల సంజీవ, సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు డేగల రమేష్ నాయుడు, రాష్ట్ర యూత్ కోఆర్డినేటర్ లొడంగి గంగాధర్ యాదవ్, చివ్వెంల, ఆత్మకూర్ మండలాల అధ్యక్షులు మూగ వెంకట్రామిరెడ్డి, గంపల లింగయ్య, మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ఎండీ ఎజాస్, మీసాల ప్రసాద్, కొండా రవి, ఎండీరఫీ, నలబోలు రాఘవరెడ్డి, నాతాల అనంత రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

సూర్యాపేట: సూర్యాపేట పట్టణంతోపాటు ఆత్మకూర్ తదితర ప్రాంతాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు మంత్రి జగదీష్‌రెడ్డి సమక్షంలో సోమవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. వీరికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, లింగరాజు, ఎల్లయ్య, ఏడు కొండలు, సాయికృష్ణ, మధుసూదన్ పాల్గొన్నారు.

తరుగు పేరిట రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

కోదాడరూరల్ : రైతులను తరుగు పేరుతో మిల్లర్లు ఇబ్బంది పెట్టొద్దని అఖిల పక్షం రైతు సంఘాల నాయకులు కోరారు. సోమవారం కోదాడ పట్టణ పరిధిలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో ఆ సంఘం కార్యవర్గ సభ్యులకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మిల్లులకు ధాన్యాన్ని నిబంధనల ప్రకారం తీసుకొచ్చినప్పటికీ తేమ, తాలు, వేబ్రిడ్జి వంటి కారణాలు చెప్తూ ఐదు కేజీల తరుగు తీస్తుండడంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. 75 కేజీల బస్తాకు కేజీ మాత్రమే తరుగు తీయాలని, ట్రాక్టర్ ట్రక్కుల్లో బోరాలలో తీసుకొచ్చే ధాన్యానికి తరుగు తీయకుండా క్వింటాళ్ల చొప్పున లెక్కగట్టి నగదు ఇవ్వాలని కోరారు. . వ్యవసాయ శాఖ, మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో వేబ్రిడ్జిలు ఏర్పాటు చేసి రైతులు మోసపోకుండా చూడాలని ఈ సందర్భంగా అఖిల పక్షం రైతు సంఘాల నాయకులు కోరారు. కార్యక్రమంలో అఖిల పక్షం రైతు సంఘం నాయకులు బొల్లు ప్రసాద్, దొడ్డా వెంకటయ్య, మేదరమెట్ల వెంకటేశ్వర్లు, కొల్లు వెంకటేశ్వర్లు, ముత్యాలు, ఉదయగిరి, నరసింహారావు, వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

హమాలీలుగా బిహార్ కార్మికులు

- నియోజకవర్గ వ్యాప్తంగా 1000మందికి పైగానే..
- వీరితో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తీరిన హమాలీల కొరత





అర్వపల్లి : కాంటాలు వేస్తూ, ధాన్యం నింపడానికి బస్తాలు తీస్తున్న బిహార్ కార్మికులు

అర్వపల్లి: వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే, ప్రతి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా ప్రతి చోట హమాలీల సమస్య ఏర్పడుతుంది. దీంతో కొనుగోళ్ల ప్రక్రియ ఆలస్యమవుతున్న సందర్భాలు ఉన్నాయి. ఈ సారి బిహార్ నుంచి కార్మికులు వచ్చి నియోజకవర్గ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హమాలీలుగా పనిచేస్తున్నారు.

ఒక్కో కేంద్రంలో 10 నుంచి 15మంది..

నియోజకవర్గంలోని తుంగతుర్తి, తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం తదితర మండలాల్లో బిహార్ కార్మికులు హమాలీలుగా పనిచేస్తున్నారు. ఒక్కో ధాన్యం కొనుగోలు కేంద్రంలో 10 నుంచి 15 మంది పనిచేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 1000 మందికి పైగానే బిహార్ కార్మికులు ఈ సీజన్‌లో హమాలీలుగా పనిచేస్తూ ధాన్యం బస్తాలు నింపడం, కాంటాలు వేయడం, లారీలకు లోడింగ్ తదితర పనులు చేపడుతున్నారు. అలాగే రైస్‌మిల్లుల్లో కూడా ధాన్యం దిగుమతి వీరే చేస్తున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులకు హమాలీల సమస్య తీరినట్లయింది. ఈ సీజన్ పూర్తయ్యాక ఇక్కడే ఉండి భవన నిర్మాణ పనులకు వెళ్లనున్నట్లు బిహార్ కార్మికులు చెబుతున్నారు.

రోజుకు రూ.500 కూలి వస్తోంది



మా రాష్ట్రంలో సరైన పనులు దొరకక ఇక్కడికి వచ్చాం. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీలుగా పనిచేస్తున్నాం. రోజుకు రూ. 500 వరకు కూలీ వస్తుంది. కుటుంబాలను అక్కడే ఉంచి వచ్చాం.

– పవన్, బిహార్ వాసి

1000 మంది వరకు పనిచేస్తున్నాం



బిహార్‌లోని పూర్ణియా జిల్లా నుంచి 200మంది వరకు కార్మికులం ఇక్కడికి వచ్చి వివిధ ప్రాంతాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీలుగా పనిచేస్తున్నాం. ఈ పని పూర్తయ్యాక అవకాశం ఉంటే భవన నిర్మాణ పనులు చేస్తాం.

– సిరికాంత్, బిహార్ వాసి

హమాలీల కొరత తీరింది



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరతతో బిహార్ కార్మికులు రావడంతో పనులు చేయిస్తున్నాం. రైతులకు ఇబ్బంది తీరింది. మాతండాలోనే కొంతమంది హమాలీలు ఉంటూ వివిధ గ్రామాలకు వెళ్లి వస్తూ కొనుగోలు కేంద్రాలలో పనులు చేస్తున్నారు.

– గుగులోతు సుధాకర్, ఉపసర్పంచ్, సింగారంతండా